క్లుప్తంగా

ఏకగ్రీవం.. కురబల నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం

వి.కోట: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం మండల కురబ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణప్ప, ఉపాధ్యక్షుడిగా శంకరప్ప, ప్రధాన కార్యదర్శిగా అమరనాథ్, గౌరవాధ్యక్షులుగా జయప్ప, రాధాకృష్ణగౌడు, కోశాధికారిగా అమరనాథ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహకులు, కార్యదర్శులుగా పాపన్న, గోవింద, సుబ్రమణ్యం గౌడు, జగదీష్, దేవరాజ్ తదితరులను ఎంపిక చేసినట్లు కార్యవర్గం తెలిపింది.

12న స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి రాక

పుంగనూరు: పట్టణంలో బైపాస్ రోడ్డులోని శ్రీహరహరపురం మఠాధిపతి శ్రీ స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఈనెల 12న రానున్నారు. బుధవారం బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మురళీధర్, ఆర్‌కె.రామకృష్ణ, రాజేష్, మహేష్, రవి, డాక్టర్ రమణరావు తదితరులతో మఠం నిర్వాహకులు సమావేశమయ్యారు. స్వామివారు 11న రాత్రి పుంగనూరు చేరుకుని, 12న శ్రీచక్ర నవరణ పూజ, శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో పట్టణ ప్రజలు పాల్గొనాలని కోరారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు


పుంగనూరు: పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ కాలేజీలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై బుధవారం చైల్డ్ ఫౌండ్ ఇండియా సంస్థ అవగాహన కల్పించింది. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని, ఆ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగాధరనాయుడు మాట్లాడారు. సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, గణేష్ రాయల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



ఎస్టీ గురుకుల పాఠశాలలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న పద్మమ్మ

బంగారుపాళెం: అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని పట్టుపరిశ్రమల శాఖ సంయుక్త సంచాలకులు, మండల ప్రత్యేక అధికారి పద్మమ్మ ఆదేశించారు. బుధవారం బంగారుపాళెంలోని ఎస్టీ గురుకుల పాఠశాల, బొమ్మాయిపల్లె, బేరిపల్లె, మహాసముద్రం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. తొలుత ఆమె ఎస్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారు ? ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు ? అనే విషయాల గురించి ప్రిన్సిపల్ వెంకట సుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. సరుకుల స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని రుచి చూశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, లేదా? అని ఆరా తీశారు. పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజరు ఫామీదాబేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొమ్మాయిపల్లెలో పిల్లల బరువును చూస్తున్న స్పెషలాఫీసర్

ఆశీస్సులు

పలమనేరు: పట్టణానికి చెందిన రవికుమార్తె కుమార్తె వివాహానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం రాత్రి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ ఎస్.రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, మాజీ ఎంపీపీ ఆర్. శ్రీనివాసులు రెడ్డి, కౌన్సిలర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు.





ఏనుగులు ధ్వంసం చేసిన రాగుల పంట



ఏనుగులు తొక్కేసిన వరి మడి



ఏనుగులు విరిచేసిన మామిడి చెట్టు

రైతులు గజ..గజ

- ఏడాది కాలంగా మండలంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు
- పంటలపై ఆగని దాడులు
- భారీగా పంట నష్టం
- రైతులకు కంటికి కునుకు కరువు
- ఇప్పటికే గజదాడుల్లో ఇద్దరు మృతి
- అలాగే రెండు ఏనుగులు సైతం మృతి

జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఏనుగుల గుంపు పులిచెర్ల మండలంలో తిష్ట వేసి పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఏడాది కాలంగా మండలాన్ని వీడని ఏనుగుల గుంపు రోజూ ఎక్కడో ఒక చోట ఆహారం కోసం పంటలపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా ఇప్పటికే ఏనుగుల దాడుల్లో ఇద్దరు మరణించారు. రాత్రి పూట పంటలకు కాపలాగా వెళితే తిరిగి ఇంటికి చేరుతామో..ఏనుగుల దాడిలో కడతేరి పోతామో తెలియని పరిస్థితి రైతుల జీవితాలు అతలాకుతలమవుతున్నాయి. కొన్ని రోజులు కనుమరుగైన ఈ ఏనుగులు వారం తిరగక ముందే మళ్లీ మండలంలో హడలెత్తిస్తున్నాయి. ఏనుగుల దాడుల్లో పంటలు, ఇతరత్రా నష్టపోయిన రైతుల్లో దాదాపు 120మందికి పరిహారం సైతం అటవీ అధికారులు చెల్లించడం చూస్తే గజదాడుల తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఇట్టే బోధపడుతుంది.

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలో కొన్నేళ్ల క్రితం వరకు ఏనుగులనే మాటే లేదు. తమిళనాడు నుంచి జిల్లాలోకి ప్రవేశించిన వచ్చిన ఏనుగులు ఆ తర్వాత ఒక్కో మండలంలో స్వైర విహారం చేస్తూ చివరకు పులిచెర్ల మండలంలోకి చేరాయి. అప్పటి నుంచి ఇక్కడే తిష్ట వేశాయి. సమీప అటవీ ప్రాంతాల్లో నీరున్న చోట 13 ఏనుగుల గుంపు పగటి పూట పెద్ద వంక, చింతల వంకల్లో ఉంటూ, రాత్రిపూట పంటలపై దాడులు చేయడం నిత్యకృత్యంగా మారింది. మండలంలో పాళెం పంచాయతీలోని కోటపల్లె, జూపల్లె, పాళెం, పడమటి వైపు పాతపేట, చల్లారిపల్లె, మతుకువారిపల్లె, బోడిరెడ్డిగారిపల్లెల్లోని పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. వారం రోజులుగా వీటి దెబ్బకు చల్లావారిపల్లె, పాతపేట, బోడిరెడ్డిగారిపల్లె, మతుకువాపల్లెల్లో తీవ్ర నష్టం వాటిల్లింది.



పాళెం పంచాయతీలో సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్)

అన్ని పంటలకూ నష్టమే

ముఖ్యంగా ఇవి మామిడి తోపులకు చుట్టూ వున్న ముళ్ల కంచెను, రాతికూసాలను ధ్వంసం చేసి, మామిడి కొమ్మలు, చెట్లను విరిచేయడం, కొబ్బరి, వరి, వేరుశనగ, అరటి, టమాట పంటలను నాశనం చేస్తున్నాయి. వాస్తవానికి చెరువులు, వ్యవసాయ బోర్లలో పుష్కలంగా నీళ్లు ఉన్నా ఏనుగుల దాడులకు భయపడి పంటలు సాగు చేయడం మానేసారు. మరోవైపు ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులు వినతి పత్రాలతో పరిహారం కోసం అటవీశాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారమేదీ?

ఏనుగులు అటవీ ప్రాంతాల నుంచి పొలాల్లోకి రాకుండా కట్టడి చేసేందుకు సోలార్ ఫెన్సింగ్ వేయాలని ఎంతోకాలంగా రైతులు కోరుతున్నారు. అయితే పలమనేరు, ఇతరత్రా ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్‌ను సైతం ఏనుగుల ధ్వంసం చేసిన ఉదంతాలు ఉన్నాయి. ఇక్కడ సోలార్ ఫెన్సింగ్ వేసినా, కందకాలు తవ్వినా ఫలితం ఉంటుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అటవీ శాఖ కూడా ఏనుగుల కట్టడికి ఎన్ని ప్రయత్నాలు చేసినా సఫలం కావడం లేదు. శాశ్వత పరిష్కారం ఏమిటనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మారింది. మరోవైపు మండలంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాల జీవితాలను ఏనుగులు తలకిందులు చేస్తున్నాయి. వీటి దెబ్బకు వ్యవసాయోత్పత్తులు సైతం పడిపోయాయి.

నోటీస్ బోర్డు

నేడు రెస్కో పాలక వర్గ ప్రమాణ స్వీకారం

కుప్పం: గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు రెస్కో అధికారులు తెలిపారు. ఉదయం చెరువు కట్ట నుంచి పట్టణంలో భారీగా ర్యాలీ, తిరుపతి గంగమ్మ దేవాలయంలో పూజల అనంతరం బస్టాండు ప్రాంగణంలో ప్రమాణ స్వీకారోత్సవం, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు





రోడ్డు ప్రమాదంలో గాయపడిన దంపతులు

- అన్నమయ్య జిల్లా దంపతులకు తీవ్రగాయాలు

రొంపిచెర్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని బెంగళూరు-తిరుపతి జాతీయ రహదారిలో బండకిందపల్లె గ్రామ పంచాయతీ కమ్మోళ్లపల్లె వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమ్మయ్య జిల్లా కలకడకు చెందిన రగీన్(67), తన భార్య నీతిమా(60)తో కలిసి చిత్తూరు జిల్లా బండకిందపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి 7.45 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంలో కలకడకు బయలుదేరి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. పీలేరు నుంచి కారు మితిమీరిన వేగంతో వస్తూ వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రగీన్ కుడి కాలు, నీతిమా కుడి కాళ్లు విరిగిపోయాయి. 108లో వారిని స్థానికులు పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయస్థాయి సింపోజియం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

కుప్పం రూరల్: సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు విద్యార్థులు కొత్త ఆలోచనలతో పరిష్కారం అన్వేషించాలని ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ అన్నారు. బుధవారం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సింపోజియం-అంతరిక్ష 2కె 25ను ప్రారంభించారు. సదస్సు ప్రారంభంలో వైస్ చైర్మన్, ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ అధ్యాపకులు డాక్టర్ ఏ.సురేష్‌బాబు మాట్లాడారు. ఇలాంటి సదస్సుల్లో భాగస్వాములు కావడం వల్ల జ్ఞానం, ఆలోచనల మార్పిడి, వ్యక్తిగత సంబంధాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులు ఇచ్చిన పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్టు ఎగ్జిబిషన్, క్విజ్ తదితర పోటీలలో విజేతలకు కళాశాల యాజమాన్యం బహుమతులు ప్రదానం చేసింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, అధ్యాపకులు కె.లోగేష్, అధ్యాపకులు, వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

గాయత్రి ఆలయానికి తాళిబొట్టు సమర్పణ

పలమనేరు: పట్టణంలోని బోడిరెడ్డిపల్లె వద్ద నూతనంగా నిర్మించిన శ్రీగాయత్రి ఆలయంలో కొలువైన అమ్మవారికి మండలంలోని కొలమాసనపల్లెకు చెందిన రత్నాబయోటెక్ యజమాని రత్నమ్మ రూ.3.04లక్షల విలువైన 29 గ్రాముల తాళిబొట్టును సమర్పించారు. బుధవారం ఆమె దీనిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు.

ఒకే ఈతలో రెండు పేయ దూడలు!



రెండు పేయ దూడలతో ఆవు

ఐరాల: ఒకే ఈతలో ఒక ఆవు రెండు పేయ దూడలను ఈనింది. స్థానిక వీఎస్ అగ్రహారానికి చెందిన రైతు గుర్రప్ప మాట్లాడుతూ, బుధవారం తన ఆవు ఐదో ఈతలో రెండు పేయ దూడలు ఈనినట్టు చెప్పారు. ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. పలువురు వీటిని ఆసక్తిగా చూశారు.

చంద్రబాబు నయవంచనను ఎండగడదాం



కరపత్ర ప్రచారం చేస్తున్న ఎంపీపీ యువరాజు, పార్టీ నాయకులు

వి.కోట: చంద్రబాబు తన పాలనలో రాష్ట్రానికి చేస్తున్న నయవంచనను ప్రజలకు చాటి చెప్పి ఎండగట్టాలని ఎంపీపీ యువరాజు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముదరందొడ్డి, బోయ చిన్నాగనపల్లె పంచాయతీల్లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, క్యూ ఆర్ కోడ్ కరపత్రాలను పంపిణీ చేసి బాబు ఎన్నికల హామీల మోసాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వాన్ని, పాలకులను నిలదీయాలని కోరారు. తమ ప్రభుత్వ పాలనలో జగనన్న ఇంటి గడపకే సంక్షేమ పథకాలు అందిస్తే దీనికి భిన్నంగా చంద్రబాబు వ్యవహరిస్తూ ప్రజల ఉసురు పోసుకుంటున్నారన్నారు. పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఐరాల: ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడేందుకు టీకాల కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప ఆదేశించారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని సబ్‌సెంటర్లలో చిన్నారులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. చిన్నారులకు టీకాలు వేయడం ద్వారా ధనురాత్వం, క్షయ, కోరింత దగ్గు, తట్టు, పోలియో, హెపటైటిస్-బి, చికెన్ ఫాక్స్, గవదబిళ్లలు వంటి వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. టీకాలు పిల్లల రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తాయన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ఎస్టీ కాలనీలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు యూరియా సరఫరా చేయలేరా?

- మండల సమావేశంలో ఎంపీపీ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: పంటలు సాగు చేసేందుకు రైతులకు సరిపడే స్థాయిలో యూరియా సరఫరా చేయలేరా? అని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. ప్రధానంగా రైతాంగ సమస్యలను ఆయన ప్రస్తావించారు. రైతులు పంటలు సాగు చేయాలంటే యూరియా వినియోగం అధికమని తెలిసినా అధికారులు దీనికి తగ్గట్టు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని వ్యవసాయశాఖాధికారులను ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం తగ్గడం, రబీ సీజన్లో రైతులు సిద్ధమై పంటలు సాగు చేసే సమయంలో ఎరువుల కొరత రానివ్వకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. దీనిపై ఏఎంసీ చైర్మన్ శమిపతి మాట్లాడుతూ, రైతులకు కావాల్సినంత యూరియా, ఇతర ఎరువుల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని , ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, మండలంలో బోర్ల మరమ్మతులు, పైపులైన్లు, విద్యుత్ సమస్యలు, ఉపాధి హామీ పనులపై పలువురు చర్చించారు. సమావేశంలో వ్యవసాయాధికారిణి రెడ్డెమ్మ, వైస్ సర్పంచులు ఈశ్వరమ్మ, సరోజమ్మ , కో-ఆప్షన్ మెంబర్ బాబ్‌జాన్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామికి బుధవారం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి) ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి కుటుంబ సమేతంగా దేవస్థానం అతిథి గృహం నుంచి మేళతాళాల నడుమ పట్టువస్త్రాలను తీసుకొచ్చారు. వారికి కాణిపాకం దేవస్థాన ఈఓ పెంచలకిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చూశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమల దేవస్థానం ఏఈఓ రమణరాజు, కాణిపాకం దేవస్థానం ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, వేద పండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.





మొరం పంచాయతీలో వరి, బంతి పంటలు

పలమనేరు: మండలంలోని మొరం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరి పంటలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. దీంతో కరువు సీమగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు పంటలకు నెలవుగా మారింది. రాష్ట్రంలోనే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో పలమనేరు కూడా ఒకటి. మండలంలోని నడిమిదొడ్డిపల్లి, మొరం గ్రామాల వద్ద ఇటీవల కురిసిన వర్షాలతో వరిపంట కళకళలాడుతున్నాయి. మరోవైపు బంతి చెట్లు సైతం ఆకర్షణగా మారాయి.

పలమనేరులో హైటెక్ వ్యభిచారం

- వాట్సాప్‌లో అమ్మాయిల ఫొటోలు పెట్టి పెట్టి బుకింగ్!
- రూ.5వేలు ఫోన్‌ఫే చేస్తే లొకేషన్
- పోలీసుల దాడుల్లో వెలుగులోకి..

పలమనేరులో కొత్త తరహాలో చేస్తున్న హైటెక్ వ్యభిచారం గుట్టురట్టైంది. నిర్వాహకులు వాట్సాప్‌లో అందమైన అమ్మాయిల ఫొటోలు పెట్టి వారిలో ఎవరూ కావాలో సెలెక్ట్ చేసుకునేలా చేస్తున్నారు. ఆపై నచ్చిన వారిపై క్లిక్ చేసి మెసేజ్ చేయగానే కస్టమర్ నంబరుకు కాల్ వస్తుంది. వారు మాట్లాడుకుని అవతలి వ్యక్తి నంబరుకు ఫోన్‌పే చేస్తేచాలు. ఆపై నేరుగా మొబైల్‌కు వచ్చిన లొకేషన్‌కు వెళితే..అన్ని పనులూ సాగిపోతూంటాయి!

పలమనేరు: ఓ ఇంట్లో వ్యభిచారం గుట్టుగా సాగిస్తున్నారని సమాచారం అందడంతో తాజాగా ఇక్కడి పోలీసులు స్థానిక సూరప్పవీధిలోని దాడులు చేశారు. అక్కడి నిర్వాహకురాలు జ్యోత్స్న(24)ను, విటుడు రామకుప్పం మండలం అత్తికుప్పానికి చెందిన సునీల్(25), మరో మహిళ రజియా(34)ను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేశారు. నిర్వాహకురాలు అక్కడ ఓ ఇంటిని అద్దెకు తీసుకొని అమ్మాయిలను పిలిపించి వ్యభిచారం చేయిస్తున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.

ఈ వ్యవహారం జరిగేదెలాగంటే..?

పలమనేరులో జరిగిన వ్యభిచారాన్ని పోలీసులు పట్టుకున్నా వారికి దీని వెనుక సాగుతున్న తతంగం అర్థం కాలేదు. కానీ ఇది హైటెక్ వ్యభిచారమని ఇప్పుడు బయటపడింది. వాట్సాప్, ఇన్‌స్టాలో ప్రొఫైల్ క్రియేట్ చేసి అందులో కేవలం లోకల్ అమ్మాయిల ఫొటోలను పెట్టి హోం సర్వీస్ 24 అవర్స్ అవైలబుల్ అని ఓ నంబర్ పెడుతున్నారు. అక్కడున్న అమ్మాయిల్లో నచ్చిన వారిని ఎంపిక చేసుకొని కేవలం ఓకే పెడితేచాలు. వెంటమే సెల్‌కు కాల్ రావడం.. ఆపై రూ.3వేల నుంచి రూ.5వేల వరకూ రేటు ఫిక్స్ చేసుకుని నిర్వాహకురాలి ఫోన్‌ఫేకు ముందుగా డబ్బు పంపాలి. ఆపై కొత్త నంబరు నుంచి సెల్‌కు లొకేషన్ వస్తుంది. చెప్పిన సమయానికి ఆ స్పాట్‌కు వెళితే ఎలాంటి సమస్య లేకుండా ఇంట్లోకి వెళ్లిపోవచ్చు. పక్కన ఎవరైనా అడిగితే తమ బంధువులని చెప్పి మేనేజ్ చేస్తున్నారు!

ఈ కూపంలోకి విద్యార్థినులు సైతం..

ఇలా ఉండగా పట్టణంలోని బ్యూటీపార్లర్లు, లేడీస్ జిమ్ సెంటర్లు లాంటివి నిర్వహించే కొందరు అక్కడికి వచ్చే అమ్మాయిలను ఈ కూపంలోకి సులువుగా దించుతున్నట్టు తెలిసింది. బయటి ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నవారు, డబ్బు అవసరం ఉన్న మహిళలను టార్గెట్ చేసి ఈజీగా డబ్బు సంపాదించవచ్చునంటూ ఇందులోకి దింపుతున్నట్టు తెలిసింది. జల్సాలకు, లేదా డబ్బుల కోసం కొందరు అమ్మాయిలు ఈ రొంపిలోకి దిగుతున్నారు. బాలికలను పట్టణాలకు పంపేవారు, హాస్టళ్లలో పెట్టిన వారి విషయంలో తల్లిదండ్రులు సైతం తమ పిల్లల కార్యకలాపాలపై కాస్త నిఘా పెట్టాల్సిన అవసరాన్ని ఈ ఉదంతం హెచ్చరిస్తోంది.